కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో...
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :125 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 01-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## తెలంగాణలో రైలు ప్రమాదాల నివారణకు 'కవచ్' రక్షణ వ్యవస్థను వినియోగిస్తున్నాం



గద్వాల: తెలంగాణలో రైల్వే మార్గాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందనికేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కొత్త రైల్వే మార్గాలతో రైలు ప్రయాణాలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి జోగులాంబ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అమృత్ భారత్ పథకం కింద రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధికి గుర్తించగా, ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. రైలు ప్రమాదాల నివారణకు 'కవచ్' రక్షణ వ్యవస్థను తెలంగాణలో వినియోగిస్తున్నామని, భవిష్యత్ లో దేశవ్యాప్తంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో దేశంలో ఏడు బుల్లెట్ ట్రైన్లు రానుండగా, అందులో మూడు తెలంగాణకు కేటాయించినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులకు సుమారు రూ.5 లక్షల కోట్ల నిధులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జోగులాంబ రైల్వే స్టేషన్ సమీపంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.45 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల రైల్వే స్టేషన్లను పరిశీలించనున్నట్లు తెలిపారు.

## ఏ ప్రభుత్వమైనా టైటిల్ మారింది తప్ప.. దోపిడీ విధానాలు మారలేదు



సిద్ధిపేట, ఆగస్టు 31: భూమి వివరాల కోసం బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ఇంకా దరిద్రంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. 22 ఏ తో దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్థం లేని విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఒప్పుకున్నారని గుర్తు చేశారు. తప్పును మాత్రం సరిదిద్దుకోవడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు బీఆర్ ఎస్ అయినా.. నేడు కాంగ్రెస్ అయినా టైటిల్ మారింది తప్ప, దోపిడి విధానాలు మారలేదని వ్యంగ్యంగా అన్నారు. 403 సర్వే నెంబర్‌లో కేవలం రెండు ప్లాట్లు సమస్యల్లో ఉంటే వేలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని వివరించారు. అదే సర్వే నెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు మాత్రం 22 ఏ నుంచి బయటకు ఎలా వచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. పేదల భూములు గుంజుకుని ప్రభుత్వం అమ్ముకుంటున్నదని విమర్శించారు. తమ భూములు కాపాడండంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. 22 ఏ నిషేధిత జాబితాపై శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 ఏపై స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రైతుల కోసం బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. వారి కోసం జైలుకైనా వెళ్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రారంభమయ్యే లోపు ప్రభుత్వం 22ఏ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీజేపీ చీఫ్ రామచందర్ రావు సూచించారు.

22 ఏ జీవో తొలగించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం: ఎంపీ

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులకు, పేదలకు న్యాయం అన్నారని ఆ పార్టీ నేతలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. కానీ ఇప్పుడు పేదలు, రైతుల పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పయింది సరి చేస్తామన్నారని చెప్పారని.. కానీ పేదలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు విక్రయిస్తేనే రాష్ట్రాభివృద్ధి అంటున్నారని రేవంత్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. భూమి విక్రయాలను గొప్పగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. 22 ఏ రైతుల భూమి మీద పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు కష్టం వస్తే తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. భూభారతి తెస్తే రైతు కష్టం తీరుతుందని చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు, రెవెన్యూ మంత్రి భూములు కూడా 22 ఏలో పడ్డాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తులు ఇప్పుడు ప్రజలకు చూపాలని డిమాండ్ చేశారు. గుంపు మేస్త్రి దరఖాస్తు బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. మీ భూములు ఏ దరఖాస్తులు లేకుండా 22 ఏలో నుంచి ఎలా తీసేస్తారని ఈ సందర్భంగా వారిని సూటిగా ప్రశ్నించారు. మరి రైతుల భూములు ఎందుకు తియడం లేదని వారిని సందేహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లాలో భూములు ఎవరికి తెలియకుండా మాయం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల పేరిట, ప్రాజెక్టుల పేరిట భూములు లాక్కున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇక్కడి భూములు విక్రయించి.. ఆ సూట్ కేసులు ఢిల్లీకి మోస్తున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఇంకో ఏడాది అయితే కాంగ్రెస్‌లో కార్యకర్తలు ఎవ్వరు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భూములు నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్‌ను నిషేధించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ప్రజాపాలనకు 1000 రోజులు పూర్తి



హైదరాబాద్ : ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలన ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నట్లుగా టీపీసీసీ అధ్యక్షులు బీ. మహేశ్ కుమార్ గౌడ్ ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్టు చేశారు. ప్రజాపాలనలో 1000 రోజులు ఓ మైలురాయి వంటిదని, 1000 రోజుల పండుగలో విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేశామని, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.

రైతు సంక్షేమానికి రూ.1.75లక్షల కోట్ల ఖర్చు..

ఎన్నికల హామీ మేరకు రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ.. 25 లక్షల మంది రైతులకు రుణ విముక్తి చేశామని, రైతు భరోసాను ఎకరానికి రూ.12 వేలకు పెంచాం అని, ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్ల బోనస్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేశామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేసి రికార్డు సృష్టించాం అని, రూ.20 వేల కోట్లకు పైగా రుణమాఫీతో 25.35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చామన్నారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించాం అని, ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు రూ.30 వేల కోట్లు ఖర్చు, సన్నవడ్ల బోనస్‌కు దాదాపు రూ.4 వేల కోట్లు కేటాయింపు, రైతుబీమాకు రూ.3,500 కోట్లు ఖర్చు చేశాం అని గుర్తు చేశారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యత..

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, రూ.500కే ఎల్పీజీ సిలిండర్ పంపిణీ చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు పథకం అందించామని గుర్తు చేశారు. పేదల ఆశలు నెరవేర్చే దిశగా 16.32 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ చేశామని, 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులతో 3.43 కోట్ల మందికి ప్రయోజనం అందించామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగిస్తున్నామని, మహిళా సాధికారికత సాధనలో పురోగమించామని పేర్కొన్నారు.

70వేలకు పైగా ఉద్యోగాలు..

తెలంగాణ యువతలో విశ్వాసం కలిగించేలా 70 వేలకు పైగా ప్రభుత్వ నియామకాలు చేపట్టామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. యువత నైపుణ్యాభివృద్ధికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నాం అని, పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహారం ప్రారంభించామని, 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దావోస్, ఫ్యూచర్ సిటీ గ్లోబల్ సమ్మిట్ ల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి పరిశ్రమలు, ఉపాధి కల్పన అవకాశాలు పెంచామని అన్నారు. ప్రపంచపటాలు పరిశీలించండి

బీసీ కులగణనతో సామాజిక న్యాయానికి పెద్దపీట

బీసీ కులగణన చేపట్టి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాం అని, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయడం విప్లవాత్మక చర్య అని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్ర బిందువుగా మార్చాం అని, రాహుల్ గాంధీ సామాజిక న్యాయ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణలో కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. వచ్చే రోజుల్లో ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా, ప్రజాదరణ పొందే విధంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతామని విజ్ఞప్తి చేస్తున్నట్లుగా తెలిపారు.

## ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ నుంచి మనకేమన్నా పెట్టుబడులు వచ్చినయా..?



హైదరాబాద్, రేవంత్ రెడ్డి ఈ సంవత్సరంలోనే దావోస్‌కు వెళ్లినప్పుడు ఇజ్రాయెల్ ఇన్నోవేటివ్ అథారిటీ వాళ్లను కలిశారు. నిజంగానే ఇజ్రాయెల్ ఇన్నోవేటివ్ అథారిటీ నుంచి మనకేమన్నా పెట్టుబడులు వచ్చినయా..? తెలంగాణ రాష్ట్రంలో ఏమైనా అంటే శూన్యమని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదు.. కానీ ఒక్క కంపెనీతో మాత్రం ఒప్పందం చేసుకున్నరు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఇంత కష్టపడి ఇక్కడి నుంచి ఫారిన్‌కు వెళ్లి ఇజ్రాయెల్ అధికారులను కలిస్తే వాళ్లు చేసుకున్న ఒప్పందం టెసరాక్ట్ అడ్వాన్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్. రేవంత్ రెడ్డి చెప్తే ఇజ్రాయెల్ వాళ్లు కొండల్ రెడ్డి కంపెనీ అయిన టెస్సెరాక్ట్‌తో ఒప్పందం చేసుకున్నారు. అప్పుడే ఇజ్రాయెల్ ప్రభుత్వ అధికారితో రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి కూడా భేటీ అయ్యాడు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం టెస్సెరాక్ట్ కంపెనీకి తక్కువ ధరలో భూములు కట్టబెడితే.. శ్రీధర్ బాబు వచ్చి కొండల్ రెడ్డికి, టెస్సెరాక్ట్ కంపెనీకి సంబంధం లేదు అని అంటున్నాడు. కొండల్ రెడ్డి ఇప్పుడు ఇజ్రాయెల్ డిఫెన్స్ సిస్టమ్ అనే కొత్త కంపెనీకి కూడా చైర్మన్ అయ్యాడు.. ఆయన అంత పెద్ద సైంటిస్టా మరి..? అని ప్రశ్నించారు.

## 2028 నాటికి వెలిగొండ ఫేజ్-2 పూర్తి చేస్తాం



అమరావతి: కృష్ణమ్మ రాకతో ఫ్లోరైడ్ చరిత్రగా మిగిలిపోతుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. గోదావరి పుష్కరాల కంటే పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని, గోదావరి జలాలను విశాఖకు తీసుకెళ్తామని అన్నారు. మార్కాపురం అన్ స్టాపబుల్ అని.. వెలిగొండ నిర్వాసితులకు పాదాభివందనం తెలియజేశారు. ఈ సందర్భంగా వెలిగొండ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొండలు అడ్డొచ్చాయని.. తొలగించి ముందుకెళ్లామని, సమస్యలు వచ్చాయని అధిగమించామని అన్నారు. 2019లో మనం అధికారంలో వచ్చి ఉంటే రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తయ్యేదని, ప్రాజెక్టుకు పట్టిన గ్రహణం 2024లో వీడిందని, చంద్రబాబు పేర్కొన్నారు.

## తెలంగాణలో వర్షాలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్



హైదరాబాద్, ఆగస్టు 31: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వివరించింది. ఈ ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అలాగే పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరి ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురవచ్చని వివరించింది. అదే విధంగా రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో ఈ రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుందని చెప్పింది. హైదరాబాద్ మహానగరంలోనూ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది.

## తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో సరికొత్త పారిశ్రామిక విప్లవం..




హైదరాబాద్: తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానాలకు రూపకల్పన చేస్తోంది. ప్రస్తుత పారిశ్రామిక విధానానికి దాదాపు పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో 'ఇండస్ట్రియల్ పాలసీ 2.0'ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతికత ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు సృష్టించడం ఈ కొత్త విధానాల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలు, టైర్-2, టైర్-3 నగరాలకు పారిశ్రామిక కార్యకలాపాలను విస్తరించడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది.

10 రంగాల్లో ప్రత్యేక విధానాలు

ఇండస్ట్రియల్ పాలసీ 2.0లో భాగంగా మొత్తం 10 కీలక రంగాలకు ప్రత్యేక విధానాలను రూపొందించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన కొత్త విధానం ప్రకటించగా.. మిగిలిన రంగాలపై కసరత్తు కొనసాగుతోంది. లాజిస్టిక్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, ఫుట్‌వేర్-లెదర్, అప్పెరల్-లైఫ్‌స్టైల్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, డేటా సెంటర్స్, ఆటోమొబైల్ రంగాలు ఇందులో ఉన్నాయి.

భారీ పరిశ్రమలకు మరిన్ని ప్రోత్సాహకాలు

కొత్త పారిశ్రామిక విధానాల్లో పెట్టుబడి విలువ ఒక్కటినే ప్రాతిపదికగా తీసుకోకుండా.. ఉద్యోగాల కల్పన, తయారీ సామర్థ్యం, ఎగుమతులు, స్థానికంగా ఏర్పడే విలువ, ప్రభుత్వానికి వచ్చే ఆదాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. పెద్ద, భారీ, మెగా పరిశ్రమలను రాష్ట్రానికి ఆకర్షించేలా ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు అదనపు ప్రయోజనాలు కల్పించే అంశంపైనా దృష్టి సారించింది.

లైఫ్ సైన్సెస్‌పై భారీ అంచనాలు

లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు 'నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30'ను ఇప్పటికే తీసుకొచ్చింది. 2030 నాటికి ప్రపంచంలోని అగ్రశ్రేణి లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వచ్చే ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా పెట్టుకుంది. జీనోమ్ వ్యాలీ విస్తరణతో పాటు మెడికల్ డివైసెస్, గ్రీన్ ఫార్మా, ఫార్మా విలేజీలు, బయో ఇన్నోవేషన్ వంటి విభాగాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఏఐ, డీప్‌టెక్‌కు ప్రాధాన్యం

హైదరాబాద్‌లో ఇప్పటికే బలంగా ఉన్న ఐటీ రంగాన్ని తదుపరి దశకు తీసుకెళ్లేందుకు 'ఐటీ పాలసీ 2.0'ను రూపొందిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డీప్‌టెక్, ఫిన్‌టెక్, డిజిటల్



## సంపాదకీయం

**మంగళవారం 01-09-2026**

# చేసిన పాపాలే..శాపాలై..

నేపాల్‌లో సంభవించిన ఘోరమైన వరదలు, భోటేకోషి , త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాల్లో సృష్టించిన బీభత్సం వెనుక చైనా కక్కుర్తి ఉందన్న విమర్శలు వస్తున్నాయి. భూభాగ సరిహద్దుల వివాదాలు మరి, కట్టడాల వల్లనే ఈ వరదలన్న అభిప్రాయం వినిపిస్తోంది. చైనా టిబెట్ సరిహద్దు వద్ద నిర్మిస్తున్న మౌలిక వసతులు, డ్యామ్‌లు , నియంత్రణ లేని నిర్మాణ కార్యకలాపాల వల్ల ప్రవాహాలు మళ్లి నేపాల్ వైపు ముంచెత్తుతున్నాయని, అందుకే ఈ విపత్తుకు చైనా విధానాలే పరోక్ష కారణమనే ప్రచారం ఊపందుకుంది.ఈ విపత్తుకు కేవలం మానవ తప్పిదాలే కాకుండా హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ మార్పులు ప్రధాన కారణమని తేలింది. అంతర్జాతీయ సమగ్ర పర్వత అభివృద్ధి కేంద్రం అధ్యయనాల ప్రకారం టిబెట్-నేపాల్ సరిహద్దులోని లెండే ఖోలా ప్రాంతంలో భారీ మంచు , రాళ్ల కొండచరిలు విరిగిపడటమే ఈ హఠాత్ వరదలకు ముఖ్య చోదక శక్తిగా మారింది.మరోవైపు అంతర్జాతీయ పర్యావరణ వేత్తలు చైనాపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిబెట్ పీఠభూమిపై విస్తృతంగా జరుగుతున్న ఆనకట్టల నిర్మాణం, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుల విస్తరణ , ఎగువ భాగాల్లో సమాచార వ్యవస్థలను నేపాల్ వంటి దిగువ దేశాలతో సరిగ్గా పంచుకోకపోవడం చైనా పెద్ద తప్పిదమని విమర్శిస్తున్నారు. నదీ ప్రవాహ డేటాను దాచిపెట్టడం వల్ల నేపాల్ ప్రజలు సకాలంలో అప్రమత్తం కాలేకపోతున్నారని అంతర్జాతీయ మీడియా ఎండగట్టింది.ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు? పర్యావరణ పరిరక్షణను పక్కనపెట్టి చైనా హిమాలయాల్లో సరిహద్దు వెంట చేపడుతున్న మౌలిక ప్రాజెక్టులే పదేపదే ఇలాంటి ప్రమాదాల తీవ్రతను పెంచుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాద నివారణకు చైనా సరిహద్దు దేశాలతో పారదర్శకమైన వాతావరణ సమాచారాన్ని పంచుకోవాలని, ఆనకట్టల నిర్మాణ భద్రతపై జవాబుదారీతనంతో వ్యవహరించాలని అంతర్జాతీయ సమాజం డిమాండ్ చేస్తోంది.సుమారు 2,000 అడుగుల వెడల్పు ఉన్న ఆ హిమానీనదంలోని ఒక భాగం అకస్మాత్తుగా విరిగి, 4,000 అడుగుల లోతున ఉన్న లోయలోకి పడింది. అది 5.2 తీవ్రతతో భూకంపం లాంటి ప్రకంపనలను సృష్టించేంత శక్తివంతమైంది. ఆ ప్రకంపనలు ఎంత బలంగా ఉన్నాయంటే, యుఎస్ జియోలాజికల్ సర్వే మొదట దానిని భూకంపంగా పొరపాటుపడింది. తర్వాత భూకంపం కాదని నిర్ధారించుకున్నారు. ఆ హిమానీనదం కూలిపోవడమే భూకంప తరంగాలను సృష్టించింది. ఆ తర్వాత జరిగిన విధ్వంసం మాటలకు అందనిది...ఇదంతా లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతాల ఉత్తరపు వాలు ప్రాంతాల్లో మొదలైంది. గూగుల్ ఎర్త్, ప్లానెట్ ల్యాబ్స్, నేపాల్ నేచురల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ వారి ఉపగ్రహ చిత్రాల ప్రకారం, ఆ ప్రాంతం ఒక భారీ హిమానీనదంతో కప్పి ఉంది. సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్న ఈ హిమానీనదం దిగువ భాగం అకస్మాత్తుగా విడిపోయి, కింద ఉన్న లోయలోకి 4,000 అడుగుల లోతు నుంచి పడిపోయింది.దీని వల్ల విడుదలైన శక్తి హిరోషిమా అణు విస్ఫోటనం శక్తిలో సుమారు 6.3 శాతంగా అంచనా వేశారు. ఇది ఎంత శక్తివంతమైనదంటే, మొదట దీనిని 4.4 తీవ్రత గల భూకంపంగా భావించింది. ఆ తర్వాత, మరింత లోతుగా దర్యాప్తు చేస్తే ఇది భూకంపం కాదని, ఒక హిమానీనదం కూలిపోవడం వల్ల కలిగిన 5.2 తీవ్రత గల ప్రకంపన అని వెల్లడైంది. అంటే, మంచు పొర కూలిపోవడంతో వల్ల భూకంపం వంటి ప్రకంపనలను సృష్టించిందిఈ భారీ మంచు కొండ లోయలోకి కూలినప్పుడు, అది భోటే కోషి నదికి ఉపనది అయిన లెండే ఖోలా నదిని పూర్తిగా అడ్డుకుంది. దీనివల్ల ఒక సహజ ఆనకట్ట ఏర్పడి, దాని వెనుక భారీగా వరద నీరు పేరుకుపోయింది. ఈ మంచు ఆనకట్ట ఎక్కువ సేపు ఉండలేదు. కరిగిపోయింది. నదీ జలాలు, బురద, రాళ్లతో కలిసి ఒక భయంకరమైన పరిస్థితిని సృష్టించింది. ఆనకట్ట తెగినప్పుడు, బయటకు ప్రవహించింది కేవలం నీరు మాత్రమే కాదు. అది బురద, రాళ్ళు, మంచు, శిథిలాలతో కూడిన ఒక భయంకరమైన తుపాను పరిస్థితిని క్రియేట్ చేసింది. నిపుణులు దానిని "లిక్విడ్ కాంక్రీటు"గా వర్ణించారు. అది ఎంత శక్తివంతంగా ఉందంటే, దానిని ఆపడం అసాధ్యమైంది. 100 అడుగుల ఎత్తైన ఈ సునామీ లాంటి అల, లెండే ఖోలా, భోటే కోషి, ఆ తర్వాత త్రిశూలి నది గుండా వేగంగా దూసుకెళ్లింది.వరద అన్నింటినీ ఊడ్చేసింది. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడాతో సహా రెండు డజన్ల దేశాలకు చెందిన 579 మంది పర్యాటకులతో కలిపి సుమారు 826 మంది గల్లంతయ్యారు. టిబెట్‌లోని గిరాంగ్ కౌంటీలో 558 మంది గల్లంతయ్యారని చైనా మీడియా నివేదించింది. కొన్ని నివేదికల ప్రకారం గల్లంతైన వారి సంఖ్య 1,000కి పైగా ఉంది.లాంగ్‌టాంగ్ ట్రెకింగ్ మార్గానికి స్టార్టింగ్ పాయింట్ అయిన స్యాబ్రుబేసి ధ్వంసమైంది. కైలాష్ మానస సరోవర యాత్ర మార్గాలు కూడా మూతపడ్డాయి. నేపాల్‌లోని రసువా జిల్లాలో దాదాపు 13 జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితం కాగా, తొమ్మిది బ్యాంకు శాఖలు కొట్టుకుపోయాయి. 26 మంది ఉద్యోగులు ఇప్పటికీ గల్లంతయ్యారు.ఇది కేవలం ఒక ప్రమాదం కాదు. ఒక పెద్ద మార్పుకు సంకేతం. హిమాలయాల్లోని హిందూ కుష్ ప్రాంతం ప్రపంచ సగటు కంటే వేగంగా వేడెక్కుతోంది. 2023 నాటి ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, గత 30 ఏళ్లలో నేపాల్‌లోని మంచుతో కప్పి ఉన్న శిఖరాలు తమ మంచులో దాదాపు మూడింట ఒక వంతును కోల్పోయాయి. గత దశాబ్దంతో పోలిస్తే, ఈ దశాబ్దంలో హిమానీనదాల కరిగిపోవడం 65 శాతం వేగవంతమైంది.ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్ ప్రకారం, హిందూ కుష్-హిమాలయ ప్రాంతమంతటా వరదలు, కొండచరియలు విరిగిపడటం, హిమపాతాలు పెరుగుతున్నాయి. ఒక్క నేపాల్‌లోనే 47 హిమానీనద సరస్సులు ఉన్నాయి, అవి ఏ క్షణంలోనైనా విస్ఫోటనం చెందగలవు, అందుకే వాటిని "టైమ్ బాంబులు" అని పిలుస్తున్నారు.హిమాలయాల భూగర్భ నిర్మాణం ఇప్పటికే అస్థిరంగా ఉందని నిపుణులు అంటున్నారు. భారత, యూరేషియన్ ఫలకాలు ఇప్పటికీ ఢీకొంటూ ఉండటం వల్ల, హిమాలయాలు సంవత్సరానికి 40-50 మిల్లీమీటర్ల మేర పైకి లేస్తున్నాయి. ఈ అస్థిరమైన భూభాగానికి గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు కూడా తోడైనప్పుడు, ఇలాంటి ఘటనలు మరింత తరచుగా జరుగుతాయి.ఈ విషాదం 2015లో లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతం దక్షిణ వాలు నుంచి కొండచరియ విరిగిపడి దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయిన 7.8 తీవ్రత గల భూకంపంను గుర్తుచేస్తోంది. ఇప్పుడు, అదే పర్వతం మరోసారి వినాశనానికి కారణమైంది.వరద నీరు ఎంత బలంగా, భారీగా ఉందంటే, శిథిలాలు దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణి నదిని చేరుకున్నాయి. నేపాల్ ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థసహాయక, రెస్క్యూ కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. ప్రశ్న ఏమిటంటే: భవిష్యత్తులో రాబోయే ఇలాంటి ఘటనలకు మనం సిద్ధంగా ఉన్నామా? పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కరుగుతున్న హిమానీనదాలు తీవ్రమవుతున్న అస్థిరత హిమాలయాలను ప్రమాదకరమైన ప్రాంతంగా మారుస్తున్నాయి.

# తెలంగాణ బీజేపీలో కేడర్‌ను.. ముందుండి నడిపించే నాయకుడెవరు?



హైదరాబాద్,తెలంగాణాలో పాగా వేయాలన్న భారతీయ జనతా పార్టీ ఆకాంక్షకు నాయకత్వ లేమి శాపంగా మారుతోంది. ఒకప్పుడు అవకాశాలు ఆమడ దూరంలో కూడా కనిపించక, ఇప్పుడు అనుకూలత పుష్కలంగా ఉండి కూడా ఏమీ చేయలేని దుస్థితి నెలకొంది. ఓ వైపు కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం, మరోవైపు జాతీయ పార్టీ అధినాయకత్వం 'తామున్నాం.. ముందడుగు వేయండి' అని బలమైన సపోర్టును అందిస్తున్నా.. అందిపుచ్చుకోలేని రాజకీయ వ్యవస్థ ఆ పార్టీలో కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజాగా నెలకొన్న సామాజిక పరిస్థితులు, పరిణామాలు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు ప్రతికూలతను స్పష్టం చేస్తున్నా.. తెలంగాణ బీజేపీలో కేడర్‌ను ముందుండి నడిపించే నాయకుడెవరన్న ప్రశ్న ఆ పార్టీని వెంటాడుతూనే ఉంది. తాము సైతం అంటూ.. జిల్లా పార్టీ నాయకత్వాలు సవాళ్లు విసురుతుంటే, పోటీకి సిద్ధమంటూ నియోజకవర్గ స్థాయిలో ఆశావహ అభ్యర్థులు వనరులను సంసిద్ధం చేసుకుంటుంటే.. బలపడుతున్న సంస్థాగత నాయకత్వానికి పార్టీ నుంచి ప్రోత్సాహం కరవైపోతోందన్న ఆందోళన క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోంది.వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అనేక మంది ఆర్థిక సుస్థిరత కలిగిన నేతలు పోటీకి సై అంటున్నా.. వెన్నుతట్టి ప్రోత్సహించే నేతలు కనిపించని వైనం, దయనీయం వెంటాడుతోంది. ఎవరికి వారు పదవులు కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు తప్ప రాష్ట్ర పార్టీలో అయోమయ స్థితిని, ప్రతికూల సంకేతాలను పట్టించుకోవడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు తమ ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా లోపాలు, వైఫల్యాలను గుర్తించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తెలంగాణాలో అధికారమే లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం ఎంతటి తాపత్రయంతో ఉందో.. అంతే స్థాయిలో రాష్ట్ర నాయకత్వంలో అలసత్వం కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ యుద్ధ వాతావరణంలో బీజేపీకి సానుకూలత పెరుగుతూ వస్తోందని రాజకీయ విశ్లేషకుల తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. అయినా, పరిస్థితులను ఎందుకు అందిపుచ్చుకోలేక పోతున్నారని కేడర్ ప్రశ్నలు సంధిస్తోంది.

### త్వరలోనే సంస్థాగత ప్రక్షాళన..

కేంద్ర వర్గాల సమాచారం మేరకు త్వరలోనే సంస్థాగత ప్రక్షాళన దిశగా చర్యలకు కసరత్తు.. పదవుల్లో కీలక మార్పులు ఉంటాయని తెలుస్తోంది. సంఘ్ పరివార్ హెచ్చరిస్తున్నా పట్టించుకోని బీజేపీ నేతలపై క్రమశిక్షణా చర్యలతో పాటు పార్టీ పదవుల నుంచి దింపే ప్రక్రియ ప్రారంభమవుతుందన్న సంకేతాలు వినవసు ‌న్నాయి. అదే సమయంలో సెప్టెంబర్‌లో కేంద్ర కేబినెట్‌లో మార్పులు జరగవచ్చని ప్రచారం గత కొద్ది రోజులుగా జరుగుతోంది. కిషన్ రెడ్డికి బీజేపీ పార్లమెంటరీ బోర్డులో చోటు- దక్కే అవకాశం ఉందని ఆ పార్టీకి చెందిన కొందరు సీనియర్లు చెబుతున్నారు. వయోదిత మంత్రులను తప్పించే యోచనలో కాశాయ పార్టీ అధిష్టానం అంతర్గత కసరత్తు ముమ్మరం చేసింది.గత కొద్ది నెలల కాలంగా తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అంతర్గత విభేదాలు, పరిపాలనాపరమైన ఇబ్బందులతో ప్రజల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. ఇటు బీఆర్ఎస్ ప్రాభవం కోల్పోతుండటం, అటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుండట ంతో.. కమలం పార్టీకి స్పష్టమైన పొలిటికల్ స్పేస్ లభించింది. కానీ, ఈ సువర్ణ అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ తీవ్రంగా తడబడుతోంది. తెలంగాణలో రాజకీయ శూన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలు ఓ మంచి ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారు. కానీ బీజేపీ ఎందుకు క్యాష్ చేసుకోలేకపోతోంది? అన్న ప్రశ్నకు ప్రస్తుతం కీలక పదవులు అనుభవిస్తున్న నేతలెవకూ సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారు. అదే తెలంగాణ బీజేపీకి ఉన్న ప్రధాన లోపమన్న విశ్లేషణలు జరుగుతున్నాయి. పాలనకు తాము సిద్ధమనే సవాల్ చేసే స్థాయి, ముఖ్యమంత్రి పదవిని చేపట్టే స్తోమత కలిగిన స్పష్టమైన తిరుగులేని ఒకరిద్దరు బలమైన నేతలు లేకపోవడంతో నాయకత్వలేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.

### ఎవరికి వారే యమునా తీరే..

గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అగ్రెసివ్ హిందుత్వ, నిరసనలతో కేడర్‌లో పీక్ లెవెల్ జోష్ ఉండేది. ఆ తర్వాత గంగాపురం కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్రనేతలు ఉన్నప్పటికీ.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా గ్రూపు రాజకీయాలు సాగుతున్నాయనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల అధికార కాంగ్రెస్‌పై లేదా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఒక్కటిగా దాడి చేయలేకపోతున్నారు. బీజేపీ జాతీయ నేతలు తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భాల్లో మాత్రమే బెంగాల్ తరహా పోరాట వ్యూహంతో ముందడుగు వేస్తామన్న సవాల్ కనిపిస్తోంది. ఆ తర్వాత యథాతథ పరిస్థితితో పార్టీ ఎలాంటి వ్యూహం లేకుండానే కాలం గడుపుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని దీదీ కోటను బద్దలు కొట్టడానికి బీజేపీ ఎలాగైతే అగ్రెసివ్ కేడర్ పాలిటిక్స్ చేసిందో, తెలంగాణలోనూ అలాంటి బెంగాల్ తరహా పోరాట వ్యూహం అవసరమనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతోంది. ఒకప్పుడు బీజేపీకి కార్యకర్త కూడా కనిపించని పశ్చిమ బెంగాల్‌లో కమలం పార్టీ ప్రతీ పంచాయతీ, ప్రతీ వార్డు స్థాయి వరకు వెళ్లి కేడర్‌ను నిర్మించి, అధికార పార్టీ దాష్టీకాలను ధైర్యంగా ఎదుర్కొంది. కానీ తెలంగాణలో ప్రెస్ మీట్లు, కరపత్రాల పంపిణీ, ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతున్నారు తప్ప.. ప్రజల తరఫున సుదీర్ఘకాలం పాటు రోడ్డెక్కి పోరాడే పాదయాత్రలు, ధర్నాలు కరవయ్యాయి.బీజేపీ పై సామాన్య ప్రజల్లో ఉన్న మరో అనుమానం కూడా వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనా? అనే పాత ప్రచారం. ఈ నెగెటివ్ ఇంప్రెషన్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టేలా బీజేపీ గ్రౌండ్ లెవెల్‌లో నమ్మకాన్ని కలిగించలేకపోయింది. తెలంగాణలో బీజేపీకి అధికారం దక్కాలంటే తక్షణమే కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరమని అభిమానుల నుంచి హెచ్చరికలు వస్తున్నాయి. పార్టీలోని గ్రూపు తత్వాలకు స్వస్తి చెప్పి, ఒక సమర్థవంతమైన, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని ముందు పెట్టి నడిపించాలి. ప్రజల నిత్య జీవిత సమస్యలైన రుణమాఫీ, ఉపాధి, రైతు భరోసా, మౌలిక వసతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్లీ కోలుకోవడం తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చునన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. "గతంలో కేసీఆర్ పదేళ్ల పాలన చూశారు, ప్రస్తుతం కాంగ్రెస్ మార్క్ పాలననూ చూస్తున్నారు.. ఒక్కసారి కమలానికి అవకాశం ఇవ్వండి" అనే బలమైన నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమవుతోంది.గత లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటినప్పటికీ, ఆ ఉత్సాహాన్ని రాష్ట్ర స్థాయి అధికారం దిశగా మళ్లించే సమిష్టి వ్యూహం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కేవలం ఢిల్లీ పెద్దల ఇమేజ్, మోడీ చరిష్మాపైనే ఆధారపడటం తప్ప.. స్థానిక నాయకత్వం ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని నింపలేకపోతోంది. కేవలం ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపడం మాత్రమే సరిపోదు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే ప్రణాళికను దాన్ని నడిపించే ఒక ఫేస్ ను చూపిస్తేనే ప్రజలు జాతీయ పార్టీలకు ప్రాంతీయ స్థాయిలో ఓటేస్తారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత, సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వంలో కీలక మార్పులు జరగవచ్చని ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో పాటు-, పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం, బీజేపీ పార్లమెంటరీ బోర్డు కూర్పు వంటి అంశాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రధాని మోడీ సెప్టెంబర్ 1న ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌ల పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి రానున్నారు. ఆయన వచ్చిన వెంటనే అధికార యంత్రాంగంలో మార్పులు మొదలవుతాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

### ఉత్కంఠ.. ఎవరికి ఏ పదవి?

ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి గవర్నర్ పదవి లభించవచ్చని గట్టిగా ప్రచారం సాగుతోంది. అదే సమయంలో, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి పార్టీ పార్లమెంటరీ బోర్డులో సభ్యత్వం ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం మోడీ కేబినెట్‌లో 69 మంది మంత్రులు ఉండగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం మరో 12 మందిని నియమించుకునేందుకు అవకాశం ఉంది. ఈ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, 70 ఏళ్లు పైబడిన 12 మంది మంత్రులను పదవుల నుంచి తప్పించి, వారి స్థానంలో యువ నాయకులకు అవకాశం కల్పించాలని ప్రధాని మోదీ భావిస్తున్నట్లు సమాచారం. అయితే, కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకంపై ప్రస్తుతానికి

# అప్పుడు ముద్దు... ఇప్పుడు వద్దా...



విజయవాడ,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు అసలు వద్దు.. ప్రతీ చోటా పోటీకి దిగి తీరాల్సిందే అంటూ ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు అయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వనని తేల్చేశారు. ఇదే జగన్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక పోరులో సరికొత్త రికార్డు స్థాయిలో ఏకగ్రీవాలు నమోదు కావడం, ఇప్పుడు దానికి భిన్నంగా ఆయన వ్యాఖ్యానించడమే దీనికి ప్రధాన కారణం.వైసీపీ పాలనా కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ఏకగ్రీవాల హవా ఎంతలా సాగిందో అర్థమవుతుంది. ఆనాడు రాష్ట్రంలో మొత్తం 660 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఏకంగా 126 స్థానాలు పోటీ లేకుండానే ఏకగ్రీవమయ్యాయి. ఇక ఎంపీటీసీల విషయానికొస్తే మొత్తం 9,696 స్థానాలకు ఎన్నికలు ప్రకటిస్తే, రికార్డు స్థాయిలో 2,371 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 2,271కి పైగా స్థానాలను అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే సొంతం చేసుకుంది. 2021 స్థానిక పోరులో పంచాయతీల నుంచి కార్పొరేషన్ల వరకు వేల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కానీ నేడు ప్రతిపక్షంలోకి రాగానే జగన్ ఏకగ్రీవాలకు స్వస్తి పలికి ఓటింగ్ జరగాల్సిందే అని పట్టుబట్టడం రాజకీయ శైలిలోని వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నాటి అధికార పార్టీ ఏకగ్రీవాల దిశగా వేగంగా అడుగులు వేసింది. నాలుగు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 13,097 పంచాయతీలకు గాను 2,196 పంచాయతీలు, అలాగే 1,31,325 వార్డులకు గాను 47,400 కంటే ఎక్కువ వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇక పట్టణ స్థానిక సంస్థల్లో చూస్తే.. 11 కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీల్లోని మొత్తం 2,711 వార్డులలో 590 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ముఖ్యంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 37 డివిజన్లు, కడప కార్పొరేషన్ పరిధిలోనూ సింహభాగం ఏకగ్రీవాలు అయ్యాయి.ఇప్పుడు వైఎస్ జగన్ ఏకగ్రీవాలు వద్దు అని చెప్పడం వెనుక ఉన్న అసలు పొలిటికల్ క్రక్స్ స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకే ఏకగ్రీవాలు చేసుకునేందుకు ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉంటాయి. అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థతో పాటు స్థానిక ప్రభావం కూటమి వైపు ఉండే అవకాశం ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపితే ప్రత్యర్థి పార్టీలే మెజారిటీ స్థానాలను పోటీ లేకుండా కైవసం చేసుకుంటాయనే ముందస్తు అంచనా జగన్‌లో ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి కేడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యంత ముఖ్యం. ఏకగ్రీవాలకు ఒప్పుకుంటే గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నిరాశకు గురవుతారు. ఓటింగ్ వరకు వెళ్తేనే అధికార కూటమిని నిలదీసే అవకాశం లభించడమే కాకుండా, రాబోయే రోజుల్లో కేడర్‌లో ఉత్సాహం నింపవచ్చని జగన్ భావిస్తున్నారు. అందుకే ఏకగ్రీవాల ప్రక్రియను నిరోధించడం ద్వారా కూటమికి సులువైన విజయం దక్కకుండా అడ్డుకోవాలనేది వైసీపీ వ్యూహం.ఈ నిర్ణయంలో ఒక రాజకీయ వైరుధ్యం కూడా కనిపిస్తోంది. తమ హయాంలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వాటిని సంక్షేమ పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని సమర్థించుకున్న వైసీపీ నేతలు.. ఇప్పుడు మాత్రం ఏకగ్రీవాలు జరిగితే అది అక్రమమే, బెదిరింపుల వల్లే జరుగుతోంది అనే ప్రచారం చేయడానికి సిద్ధమవ్వాల్సి వస్తోంది. ఏది ఏమైనా.. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని వ్యతిరేకించడం అనేది ఏపీ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా వస్తున్న అధికార-ప్రతిపక్షాల పాత ఫార్ములానే అని చెప్పవచ్చు.

# వారసులొస్తున్నారు.....

విజయవాడ, ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైందిఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది.అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు.ఈ విషయంలో వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఇప్పటికే ముందడుగు వేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమార్తె అనూషను విజయనగరం జడ్పీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా వారసత్వ రాజకీయాలకు స్థానిక ఎన్నికలే తదుపరి వేదిక అన్న సంకేతం ఇచ్చారని కొందరు భావిస్తున్నారు. దీంతో ఇతర జిల్లాల్లోని సీనియర్ నాయకులు కూడా తమ కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ స్పష్టమైన తర్వాత ఈ వారసుల జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# యూపీలో హై బీపీ....

లక్నో ,దేశ రాజకీయాలకు దిక్సూచి లాంటి ఉత్తరప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ ఆధిపత్యం క్రమంగా సవాలును ఎదుర్కొంటోందన్న చర్చ అంతటా ఊపందుకుంది. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో తిరుగులేని జయభేరి మోగించిన బీజేపీకి.. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు షాక్ ఇచ్చారు. అక్కడితో ఆగలేదని యూపీలో కమలదళం గ్రాఫ్ ఇంకా కిందకే జారుతోందని, ప్రతిపక్ష ఇండియా కూటమి ఊపందుకుంటోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో 2027లో జరగబోయే అసెంబ్లీ సమరంలో బీజేపీకి హ్యాట్రిక్ విజయం సులభం కాదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.యూపీలో బీజేపీకి ప్రధానమైన ప్లస్ పాయింట్ యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ మార్కు పాలన, పటిష్టమైన శాంతిభద్రతలు, కేంద్ర-రాష్ట్ర సంక్షేమ పథకాలు. అయితే దశాబ్దకాలపు ప్రభుత్వ వ్యతిరేకత , యువతలో పెరుగుతున్న నిరుద్యోగిత, పేపర్ లీకేజీల నిరసనలు, ద్రవ్యోల్బణం క్షేత్రస్థాయిలో ఓటర్లలో అసంతృప్తిని పెంచుతున్నాయి. వీటికితోడు ఓటర్లలో కనిపించే అలసట, స్థానిక నాయకులపై అసంతృప్తి పార్టీ స్థానాలు పడిపోవడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కేవలం మతపరమైన ధ్రువీకరణ లేదా నరేంద్ర మోదీ-యోగీ ఆదిత్యనాథ్‌ల ఇమేజ్‌పైనే ఆధారపడటం యూపీలో ఇక వర్కవుట్ కాదనేది క్షేత్రస్థాయి ఓటర్లు ఇస్తున్న స్పష్టమైన సంకేతంగా కనిపిస్తోంది. మరోవైపు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ రూపకల్పన చేసిన పిడిఏ వ్యూహం అంటే వెనుకబడిన తరగతులు, దళితులు, అల్పసంఖ్యాక వర్గాలు సోషల్ ఇంజనీరింగ్ వ్యూహం యూపీలో అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. గతంలో కేవలం యాదవ్-ముస్లిం సమీకరణలకే పరిమితమైన ఎస్పీ, ఇప్పుడు నాన్-యాదవ్ ఓబీసీలు, నాన్-జాతవ్ దళిత వర్గాలను తమవైపు తిప్పుకోవడంలో విజయం సాధించింది. కాంగ్రెస్‌తో జతకట్టి ఇండియా కూటమిగా పోటీచేస్తుం డటంతో ఓట్లు చీలిపోకుండా ప్రతిపక్షం అత్యంత బలంగా నిలబడగలుగుతోంది. ఇక బీజేపీ అంతర్గత విభేదాలు, సమాజ్‌వాదీ పార్టీ బలపడటమే కాకుండా.. కుల గణన డిమాండ్లు, స్థానిక బీసీ నేతల అసంతృప్తి కమలనాథులను వేధిస్తున్నాయి.అయితే బీజేపీని తేలికగా తీసిపారేయడానికి వీల్లేదు. ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయి నెట్‌వర్క్, బీజేపీ ఓటు బ్యాంకు మేనేజ్‌మెంట్ , ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్‌కు ఇప్పటికీ ఉన్న వ్యక్తిగత క్రేజ్ ఆ పార్టీకి అతిపెద్ద అడ్వాంటేజ్. యూపీలో బీజేపీ పరిస్థితి పూర్తిగా దిగజారకపోయినా, ఒకప్పటి ఏకపక్ష విజయాల శకం మాత్రం ముగిసిపోయింది. 2027 అసెంబ్లీ ఎన్నికల నాటికి నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, బీసీ వర్గాల ఆందోళనలను పరిష్కరించి.. నష్టనివారణ చర్యలు చేపట్టకపోతే యూపీ పీఠాన్ని కాపాడుకోవడం బీజేపీకి అత్యంత కఠినమైన సవాలుగా మారనుందన్నది ఎక్కువ మంది అభిప్రాయం.

# థియేటర్‌లో మద్యం సేవించి మహిళపై దాడి..

భద్రాచలం,ఏషియన్ థియేటర్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది.'ఇరుముడి' సినిమా చూస్తున్న సమయంలో కొంతమంది వ్యక్తులు మద్యం సేవించి వచ్చి ఓ మహిళపై దాడికి పాల్పడినట్లు అక్కడ ఉన్న ఫ్యామిలీ ఆడియన్స్ ఆరోపిస్తున్నారు.ప్రశాంతంగా సినిమా చూడాలని కుటుంబ సభ్యులతో, చిన్నపిల్లలతో థియేటర్‌కు వచ్చిన తమకు ఇలాంటి ఘటనలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సినిమా థియేటర్‌లో కూడా ప్రశాంతంగా సినిమా చూసే పరిస్థితి లేకపోతే ఇక కుటుంబాలతో బయటకు రావడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఫ్యామిలీ ఆడియన్స్ వాపోతున్నారు.ఈ ఘటనతో థియేటర్‌కు వచ్చిన మహిళలు, చిన్నపిల్లలు సైతం భయాందోళనకు గురైనట్లు తెలుస్తోంది.ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై థియేటర్ యాజమాన్యం, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఫ్యామిలీ ఆడియన్స్ కోరుతున్నారు.ప్రశాంతంగా సినిమా చూడటానికి వచ్చిన ప్రేక్షకులకు భద్రత కల్పించాలి.. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులకు ఇబ్బంది కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

# బొగ్గు నుంచి 'క్రిటికల్ మినరల్స్' దిశగా...

మంచిర్యాల, బొగ్గే బంగారం అన్నది సింగరేణి నినాదం... విధానం. ఇప్పుడు బొగ్గును బంగారంగా చూడటం కాదు.. నిజమైన బంగార గనుల తవ్వకాన్ని చేపట్టబోతోంది. తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ తమ అధీనంలో ఉన్న దేవదుర్గ గోల్డ్ కాపర్ బ్లాక్‌లో బంగారు తవ్వకాలు చేపట్టనుంది. ఇకపై బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, రాగి వంటి కీలక ఖనిజాల అన్వేషణనూ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ డిప్యూటీ, మైనింగ్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఇవాళ దేవదుర్గ గోల్డ్ బ్లాక్‌ను సందర్శించనున్నారు. సింగేణి ప్రాజెక్టు పురోగతిపై బుధవారం సమీక్ష నిర్వహించిన భట్టి గోల్డ్ మైనింగ్ పై ఫోకస్ పెట్టారు. అందుకే ఆయన దేవదుర్గ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించబోతున్నారు. దేవదుర్గ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, ఇతర సహకారాల కోసం కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని భట్టి అధికారులకు సూచించారు. సింగరేణికి బొగ్గు గనుల నిర్వహణలో దశాబ్దాల అనుభవం ఉంది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థ తన కార్యకలాపాలను విస్తరించడంపై ఇప్పుడు దృష్టి పెట్టింది. ప్రస్తుతం కర్ణాటకలో తమ అధీనంలో దేవదుర్గ బ్లాక్‌లో రాగి బంగారు అన్వేషణ మాత్రమే కాకుండా.. గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల అన్వేషణలోనూ అవకాశాలను వెతకాలని సింగరేణి నిర్ణయించింది. రాబోయే రోజుల్లో విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ రంగాల్లో క్రిటికల్ మినరల్స్‌కు ప్రాధాన్యం ఉండబోతోంది. ఇప్పటి వరకూ బొగ్గుగే పరిమితం అయిన సింగరేణి కొత్తరంగాలకు విస్తరించగలిగితే.. సంస్థకు కొత్త ఆదాయ మార్గాలు కూడా ఓపెన్ అవుతాయి. కర్ణాటకలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి నిక్షేపాల అన్వేషణకు సింగరేణి ఇప్పటికే అడుగు పెట్టింది. 2025లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ాఅఅఒ ఈ బ్లాక్‌కు ఒ-1 బిడ్డర్‌గా నిలిచింది. ఈ ప్రాజెక్టును సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ విభాగం పర్యవేక్షణలో ముందుకు తీసుకెళ్లనుంది. ఈ గనిలో తవ్వకాలు ఎంత వరకూ లాభదాయకం, అక్కడ నిక్షేపాల పరిమాణం, నాణ్యత, జియోగ్రాఫికల్ పరిస్థితులు వంటి అంశాలపై ముందుగా అధ్యయనం చేస్తారు. ఒకప్పుడు 'బ్లాక్ గోల్డ్'గా పిలిచే బొగ్గుతో గుర్తింపు పొందిన సింగరేణి... ఇప్పుడు నిజమైన 'గోల్డ్'నే వెలికితీయబోతోంది. ఇది కనుక సక్సెస్ అయితే తెలంగాణ పాలిట ఇదొక గోల్డ్‌మైనే..! దేవదుర్గలో భట్టి విక్రమార్క పర్యటనతో ఈ ప్రాజెక్టుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అసలు అక్కడ ఎంత బంగారం ఉంది? ఎంత రాగి ఉంది? అన్వేషణ తర్వాత వాణిజ్యపరంగా తవ్వకాలు సాధ్యమవుతాయా? ? ఈ ప్రశ్నలకు రాబోయే అధ్యయనాలే సమాధానం చెప్పనున్నాయి.

## ఫ్యూచర్‌సిటీ రియల్ ఎస్టేట్ జోరు

హైదరాబాద్, భారత్ ఫ్యూచర్‌సిటీలో రియల్ ఎస్టేట్ భూం నడుస్తోంది. ముఖ్యంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన 121 చదరపు గజాల ప్లాట్లకు డిమాండ్ పెరుగుతోంది. గతంలో సుమారు రూ.5 లక్షలకు అమ్ముడైన ప్లాట్లు ప్రస్తుతం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పలుకుతున్నాయి. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం ప్రారంభం, పరిసరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల పెరుగుదలతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మీర్‌ఖాన్‌పేట-ముచ్చర్ల గ్రామాల మధ్యలో దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది. దీంతో ఆ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ప్రస్తుతం ఫ్యూచర్‌సిటీలో భూ నిర్వాసితుల కోసం ప్రభుత్వం కేటాయించిన లే-అవుట్లు, స్థలాలకు గిరాకీ పెరుగుతోంది. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చిన 6 వేల మంది రైతులకు ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్లను కేటాయించింది. నిర్వాహిసితులకు ఎకరాకు రూ.8 లక్షల పరిహారంతో పాటు 121 చదరపు గజాల ఓపెన్ ప్లాట్లు ఇచ్చింది. మీర్‌ఖాన్‌పేట్, పంజాగూడ, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, ముచ్చర్ల గ్రామాల్లో నివసిస్తున్న రైతుల నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ కోసం ప్రభుత్వం రెండు దశల్లో భూములను తీసుకుంది. ఆయా గ్రామాల ప్రజలకు పంజాగూడ రెవెన్యూ పరిధిలో లేఅవుట్లు డెవలప్ చేసింది. దాదాపు 6 వేల మంది రైతులకు ఓపెన్ ప్లాట్లు కేటాయించింది. రైతుల పిల్లలు చదువుకునేందుకు వీలుగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల స్కూల్ సైతం ప్రభుత్వం నిర్మిస్తోంది. అయితే అక్కడి లే-అవుట్‌లో ఇళ్లు కట్టుకునేందుకు కొందరు సుముఖంగా లేరు. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం, ప్లాట్ అమ్మితే వచ్చే డబ్బుతో హైదరాబాద్ దగ్గర్లో భూములు కొనాలని నిర్ణయించారు. ఒకరిద్దరు రైతులు ఏడాది క్రితం విక్రయించగా.. 121 చదరపు గజాల ప్లాటు రూ.5 లక్షలకు అమ్ముడయ్యింది. తాజాగా రియల్ ఎస్టేట్ పుంజుకుంది. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం రెండు నెలల క్రితం ప్రారంభమవగానే.. ప్లాట్ల ధరలు అమాంతం పెరిగాయి. ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో నిన్న మె?న్నటి వరకు చదరపు గజం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ధర పలకగా.. నిర్వాసితులకు ఇచ్చిన ప్లాట్ల ధర అనూహ్యంగా పెరిగింది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఒక్కో ప్లాటు అమ్ముడవుతోంది. అంటే దాదాపు 10 వేల నుంచి రూ.23 వేల వరకు గజం పలుకుతోంది. జులైలో ఒక రైతు తన ప్లాటును రూ.28 లక్షలకు విక్రయించారు. ఆ ప్లాట్లను కొంటే భవిష్యత్తులో మౌలిక సదుపాయాలు వేగంగా సమకూరుతాయన్న అంచనాతో కొందరు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూములు కొనే ఆర్థిక స్థోమత లేని వారు భవిష్యత్ పెట్టుబడిగా ఫ్యూచర్ సిటీలో స్థలాలు కొనేందుకు రెడీ అవుతున్నారు.

## తగ్గేదెలా... అంటున్న కడప రెడ్డమ్మ

కడప, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కడపలో తనకు వైసీపీ పోటీయే కాదని ఆమె చేసిన వ్యాఖ్యలు అతివిశ్వాసమా? మరేదైనా కారణమా? అన్న చర్చ జరుగుతుంది. ఒక యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కడప నియోజకవర్గంలో తనకు వైసీపీ పోటీయే కాదని, తనను ఓడించే సత్తా ఆ పార్టీకి లేదని చెప్పడాన్ని పలువురు అతి విశ్వాసంగానే చూస్తున్నారు. ఎందుకంటే మహామహులే ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. జాతకాలు తిరగబడ్డాయి. అందులో తొలిసారి ఎన్నికయిన మాధవిరెడ్డి ఎంత? అని సోషల్ మీడియాలో కామెంట్స్ వినపడుతున్నాయి. వైసీపీ తనకు పోటీయే కాదని చెప్పడం గర్వం తలకెక్కిందనడానికి కారణమని, అంతగా రెచ్చిపోతే ప్రజలే బుద్ధి చెబుతారని వైసీపీ సోషల్ మీడియాలో హెచ్చరిస్తున్నారు. అయితే కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి దూకుడుగా మరియు ఆత్మవిశ్వాసంతోఉండటానికి ప్రధానంగా రాజకీయ నేపథ్యం, చారిత్రక విజయం మరియు కుటుంబ నేపథ్యం కారణాలుగా ఉన్నాయి.రెండు దశాబ్దాల తర్వాత కడప అసెంబ్లీ సెగ్మెంట్‌లో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిచిన మొదటి మహిళా ఎమ్మెల్యే ఆమె. ఆమె మామ రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి ఐదు సార్లు మంత్రిగా పనిచేసిన ప్రభావశీలమైన రాజకీయ కుటుంబం నుండి రావడంతో పాటు కుటుంబ వ్యాపారాల ద్వారా కన్‌స్ట్రక్షన్ రంగంలో అనుభవం కలిగి ఉండటం, నాయకత్వ లక్షణాలు ఉండటం. కూటమి ప్రభుత్వంలో కడప అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

# ఫుడ్ ప్యాక్‌పై రెడ్ అలెర్ట్..! చిప్స్, కూల్‌డ్రింక్స్‌పై హెచ్చరికలు ఎందుకు?

న్యూఢిల్లీ/లండన్,ఒకే బ్రాండ్.. ఒకే ఫాంటా..! కానీ దేశం మారితే చక్కెర మోతాదు ఎందుకు మారుతోంది? లండన్‌లో 63 కేలరీలతో దొరికే ఫాంటా క్యాన్‌లో ఉండే చక్కెరతో పోలిస్తే.. భారత్‌లో అదే బ్రాండ్‌లో ఏకంగా మూడు రెట్లు ఎక్కువ చక్కెర ఉంటుందన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు.. యూరప్‌లో ఆరోగ్య హెచ్చరికకు కారణమయ్యే కృత్రిమ రంగుపై భారత్‌లో మాత్రం ప్యాక్ వెనుక చిన్న అక్షరాల్లో సమాచారం ఇవ్వడమేనా..? ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఆరోగ్య హెచ్చరికల విషయంలో భారత్ ఎందుకు వెనుకబడుతోంది అన్న ప్రశ్నలు తాజాగా తెరపైకి వచ్చాయి. అందుకే చిప్ ప్యాకెట్లు, సోడాలపై రెడ్ ఫ్లాగ్ ఉండాలని భారతదేశం కోరింది. కానీ పెద్ద ఆహార దిగ్గజ సంస్థలు దీటుగా ససేమిరా అంటున్నాయి. లండన్‌లో అమ్మే ఒక ఫాంటా క్యాన్‌లో 63 కేలరీలు ఉంటాయి. అదే బ్రాండ్‌ను భారతదేశంలో కొంటే, అందులో మూడు రెట్లు ఎక్కువ చక్కెర ఉంటుంది. అంతేకాకుండా, అందులో కృత్రిమ రంగు కూడా ఉంటుంది. యూరప్‌లోని ఆహార ఉత్పత్తులలో ఈ రంగు ఉన్నట్లయితే, దానిపై స్పష్టంగా కనిపించే ఆరోగ్య హెచ్చరికను తప్పనిసరిగా ఉంచాలి. భారతదేశంలో, ఈ రంగు పదార్థం గురించి క్యాన్ వెనుక భాగంలో చిన్న అక్షరాలతో మాత్రమే తెలియజేస్తారు. ప్యాక్ చేసిన ఉత్పత్తుల ముందు భాగంలో పోషకాహార హెచ్చరికలను తప్పనిసరి చేయాలన్న భారత ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్న ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద కంపెనీలకు ఇది అనుకూలమైంది. .

కోకా-కోలా దిగ్గజాలకు ఊరట

ఫాంటాను తయారు చేసే కోకా-కోలా దిగ్గజాలకు ప్రయోజనం చేకూరినట్లు కనిపిస్తోంది. ఆహార ప్యాకేజింగ్ ముందు భాగంలో రంగు రంగుల హెచ్చరికల కోసం చేస్తున్న ఒత్తిడిని విరమించుకున్నట్లు భారతదేశ ఆహార -- భద్రతా నియంత్రణ సంస్థ ఆగస్టులో తెలిపింది. పాశ్చాత్య ఆహారంతో పోలిస్తే భారతీయ వంటకాలలో రుచులు మరింత తీవ్రంగా ఉంటాయనే విషయాన్ని అటువంటి హెచ్చరిక లేబుల్స్ పరిగణనలోకి తీసుకోవని, దానికి బదులుగా చక్కెర, కొవ్వు, ఉప్పు పరిమాణాల నలుపు -- తెలుపు పట్టికను కంపెనీలు ప్రదర్శించాలని అది ప్రతిపాదించింది.

ప్రజా ఆరోగ్య కార్యకర్తలు దాఖలు చేసిన పిటిషన్ తర్వాత భారత సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని పరిశీలిస్తోంది.

ఇండియాలో భారీ ఊబకాయం

లాన్సెట్ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, 2050 నాటికి ఊబకాయం లేదా అధిక బరువుతో బాధపడగల 45 కోట్ల మంది భారతీయుల నడుము చుట్టుకొలత ప్రమాదంలో పడింది. లేబులింగ్‌లో మరింత పారదర్శకత ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను పెంచగలదని నిపుణులు అంటున్నారు. ఈ ప్రోత్సాహంతో, సుమారు 20 దేశాలు ప్యాక్ చేసిన ఆహార పదార్థాల ముందు భాగంలో వివరణాత్మక లేబుల్‌లను అవలంబించాయి వీటిలో అధిక చక్కెర స్థాయిలను ఎరుపు రంగులో తక్కువ కొవ్వు శాతాన్ని ఆకుపచ్చ రంగులో హైలైట్ చేస్తాయి. పరిశ్రమల కార్యనిర్వాహకులతో మార్చిలో జరిగిన ఉద్రిక్త సమావేశం తర్వాత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెనక్కి తగ్గింది. అటువంటి హెచ్చరిక లేబుల్‌లు గందరగోళంగా అసమర్థంగా ఉన్నాయని వాదించారు. ఆహార పరిమాణ నియంత్రణను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టాలని కూడా కార్యనిర్వాహకులు నియంత్రణ సంస్థలను కోరారు. ఇప్పటికే పదార్థాల జాబితాలను చదవని వినియోగదారుడు, లేబుల్‌పై ఒక చిహ్నాన్ని లేదా ఐకాన్‌ను చూడటం ద్వారా సమాచారం తెలుసుకుని, వారి ఆహారపు అలవాట్లు గణనీయంగా మెరుగుపడతాయని నమ్మడం "చాలా సరళమైన ఆలోచన" అని కోకా-కోలా ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ మిలి భట్టాచార్య మార్చి 19న జరిగిన సమావేశంలో అన్నారు.

హెచ్చరిక లేబుళ్ల భయం దేనికి?

హెచ్చరిక లేబుళ్లు నిరర్థకమైనవని, ఎందుకంటే అవి వినియోగదారులను చక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహార పదార్థాలను తినకుండా నిరోధించలేవని ఆమె అన్నారు. అవి అనవసరం, ఎందుకంటే ఏ ఆహారాన్ని మానుకోవాలో తమ రోగులకు నేర్పించడంలో భారతీయ వైద్యులు మంచి పని చేశారు. కోకా-కోలా బాట్లింగ్ భాగస్వాములు సుమారు రెండు డజన్ల యూరోపియన్ మార్కెట్లలో తమ పానీయాలకు స్వచ్ఛందంగా ట్రాఫిక్-లైట్ తరహా లేబుళ్లను జోడించాయి. స్విట్జర్లాండ్ అనుబంధ సంస్థ కోకా-కోలా హెచ్‌బిసి తన వెబ్‌సైట్‌లో, అటువంటి లేబుళ్లు "స్పష్టమైన పారదర్శక " సమాచారాన్ని అందిస్తాయని పేర్కొంది. నియంత్రణ సంస్థ పూర్వపు ప్రతిపాదనలను వ్యతిరేకించిన భారతీయ లాబీలలో నెస్లే ఒక సభ్యురాలు. కానీ ఆ సంస్థ 2013 నుండి బ్రిటన్‌లో స్వచ్ఛందంగా వివరణాత్మక లేబుళ్లను ఉపయోగిస్తోంది. భారతదేశంలో తమ ఉత్పత్తులను




మార్కెటింగ్ చేసే విధానాన్ని విమర్శించిన సోషల్-మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లపై అనేక ఆహార కంపెనీలు చట్టపర ఫిర్యాదులు దాఖలు చేశాయి.

లాభాలపైనే అత్యాశ

హెచ్చరిక లేబుళ్ల వల్ల లాభాలకు ముప్పు కారణంగా, "తాము అమ్ముతున్న ఆహార పదార్థాల ఆరోగ్య ప్రయోజనాల గురించి భారత ప్రజలకు తెలియజేయకుండా, వీలైనంత కాలం వేచి చూసేందుకు" పరిశ్రమ ప్రోత్సహిస్తోందని ఆస్ట్రేలియాలోని జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌లో ఆహార విధాన విభాగాధిపతి అయిన సిమోన్ పెట్టిగ్రు అన్నారు. రెండు డజన్లకు పైగా దేశాలలో ప్యాక్ ముందు భాగంలోని లేబుళ్లపై పరిశోధన చేసిన పెట్టిగ్రు, ఆసక్తిగల వర్గాల లాబీయింగ్ కఠిన ప్రమాణాలను అమలు చేయకుండా నియంత్రణ సంస్థలను "దాదాపుగా స్తంభింపజేసిందని" అన్నారు.

భారత్ కు అనారోగ్య సెగ

పరిశ్రమ అంచనాల ప్రకారం, భారతదేశంలోని 100 బిలియన్ డాలర్లకు (రూ.9,54,917లు) పైగా ఉన్న ప్యాకేజ్డ్ ఆహార పానీయాల మార్కెట్‌లో తయారయ్యే ఉత్పత్తులలో దాదాపు 80% కొవ్వు, చక్కెర , ఉప్పు అధికంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. పరిశ్రమ రంగుల ఆధారిత హెచ్చరిక లేబుళ్లను అవలంబిస్తే, ప్యాకేజింగ్ అంతా ఎరుపు రంగుతో నిండిపోతుందని ఇండియన్ ఫుడ్ అండ్ బెవరేజ్ అసోసియేషన్ ప్రతినిధి దీపక్ జాలీ అన్నారు.

సహజ కొబ్బరి నీళ్ల పై...

పెప్సికోతో సహా పలు కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న IFBA, రాయిటర్స్ ప్రశ్నలకు సమాధానంగా, నియంత్రణ సంస్థల నుండి మరింత స్పష్టత కోరుకుంటున్నట్లు తెలిపింది. ప్రస్తుత ప్రతిపాదనల వల్ల, కేవలం సహజ చక్కెర మాత్రమే ఉన్న కొబ్బరి నీళ్ల ప్యాక్‌లపై కూడా "అధిక చక్కెర" హెచ్చరిక లేబుళు పెట్టే అవకాశం ఉందని అది పేర్కొంది. భారత నియంత్రణ సంస్థలు 2017 నుండి, ఒక ఉత్పత్తి పోషక విలువను సూచించే ప్రముఖ రంగుల ఆధత హెచ్చరికలు స్టార్ రేటింగ్‌ల వంటి ప్రతిపాదనలను ముందుకు తెచ్చాయి. కానీ, తయారీదారులు ప్యాకేజింగ్ వెనుక భాగంలో కేవలం పదార్థాలు ప్రాథమిక పోషకాహార సమాచారాన్ని మాత్రమే జాబితా చేయాల్సి ఉంటుంది. మరింత పారదర్శకతను కోరుతున్న ఆరోగ్య కార్యకర్తలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు, హెచ్చరిక లేబుళ్లను పరిశీలించాలని నియంత్రణ సంస్థలను ఆదేశించింది. ఇజ్రాయెల్ ఎరు పు-ఆకుపచ్చ సందేశాల వ్యవస్థను పరిశీలించాలని కూడా సూచించింది.

లేబులింగ్ పై వెనకడుగు

పరిశ్రమతో జరిగిన మార్చి సమావేశం తర్వాత, FSSAI వివరణాత్మక లేబులింగ్ విషయంలో వెనక్కి తగ్గింది. ప్యాకేజింగ్ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటం 'కష్టం' అని, పరిశ్రమ అభిప్రాయాన్ని ప్రతిధ్వనిస్తూ ఆగస్టులో కోర్టుకు తెలిపింది. కానీ న్యాయమూర్తులు మందలించారు. "భారతదేశం తన పౌరుల సంపూర్ణ ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ వహిస్తుందనే విషయం ప్రపంచం తెలుసుకోవాలి" అని అన్నారు. భారతదేశం సంపన్నమవుతున్న కొద్దీ, మధ్యతరగతి వినియోగదారులు కూడా తమ ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహిస్తున్నారు. మార్కెట్ పరిశోధనా సంస్థ 'ఫార్మారాక్' ప్రకారం, ఆకలిని తగ్గించే బరువు తగ్గే మందుల నెలవారీ అమ్మకాలు 2025 ప్రారంభం నుండి 400% పెరిగాయి. కార్యకర్తలు ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రాసెస్ చేసిన ప్యాక్ చేసిన ఆహారానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. జూలైలో భారత నియంత్రణ సంస్థలు, పెప్సికో ఇతర కంపెనీలు 90 రోజుల్లోగా "ఎనర్జీ డ్రింక్" లేబుల్‌ను తొలగించాలని ఆదేశించాయి.

తెరమీదకు రెండు రకాలు

బహుళజాతి ఆహార ఉత్పత్తిదారులు తరచుగా స్థానిక నిబంధనలు, అభిరుచులు కొనుగోలు శక్తికి అనుగుణంగా ఒకే రకమైన ఉత్పత్తులను వేర్వేరు వెర్షన్లలో తయారు చేస్తారు. ఉదాహరణకు, మెక్సికన్ కోక్ దాని తక్కువ సిరప్ రుచి కారణంగా విపరీత ప్రజాదరణ పొందింది.

# వైఎస్ఆర్‌సీపీ నేతల మాస్టర్ ప్లాన్లు



విశాఖపట్టణం, ఉత్తరాంధ్ర రాజకీయం ఎప్పుడూ కుల సమీకరణాలు, బలమైన కుటుంబాల ఆధిక్యత చుట్టూనే తిరుగుతుంటుంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ వంటి దిగ్గజాలు ప్రస్తుతం ఒకే రకమైన రాజకీయ ప్రాధాన్యతతో అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండాగా కనిపిస్తోందనే విశ్లేషణలు ఊపందుకున్నాయి. విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబానిది దశాబ్దాల రాజకీయ ప్రస్థానం. బొత్స సత్యనారాయణ భార్య, సోదరులు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా పనిచేసిన అనుభవం ఉంది. అయితే, ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది. తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. స్థానిక పోరు ద్వారా సీటు ఖాయం చేసుకుంటే.. భవిష్యత్తులో అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానాలకు ఆమెను సులువుగా తీసుకురావచ్చనేది బొత్స ప్లాన్. పార్టీ అధికారాన్ని కోల్పోయిన సమయంలో కేడర్‌ను కాపాడుకోవడంతో పాటు, తమ సొంత వారసులకు స్థానిక సంస్థల ద్వారా అధికారిక గుర్తింపు తీసుకురావడం సీనియర్ నేతలకు రెండు రకాలుగా కలిసివచ్చే అంశం. ఇక శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను శాసిస్తున్న ధర్మాన సోదరుల రూట్ కూడా ఇంచుమించు ఇదే దారిలో సాగుతోంది. ధర్మాన ప్రసాదరావు తన కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడిని, కృష్ణదాస్ తన కుమారుడు కృష్ణ చైతన్యను ఇప్పటికే నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా తిప్పుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి తర్వాత.. కుమారులను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడానికి స్థానిక ఎన్నికల కంటే మంచి అవకాశం మరొకటి ఉండదని ధర్మాన సోదరులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ లేదా కార్పొరేషన్ స్థాయి పోటీల ద్వారా వీరిని క్షేత్రస్థాయికి అలవాటు చేయాలని చూస్తున్నారు. ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్విస్ట్ ఏమిటంటే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత పార్టీని నడిపించడం కంటే, తమ కుటుంబ రాజకీయ వారసత్వం చేజారిపోకుండా చూసుకోవడానికే ఈ సీనియర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారం చేతిలో లేని సమయంలో పార్టీ తరపున గట్టిగా పోరాడే కంటే, స్థానిక ఎన్నికల రూపంలో వచ్చిన అవకాశాన్ని వాడుకుని తమ వారసులకు ప్రజాప్రతినిధి ముద్ర వేస్తే, భవిష్యత్తులో అధికార మార్పిడి జరిగినప్పుడు సులువుగా స్థిరపడవచ్చనేది వీరి ఆలోచన. ఈ వారసత్వ రాజకీయాల ఎత్తుగడలకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలంగా ఉంది. అధికారంలో ఉన్న కూటమి స్థానిక ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో సీనియర్లు తమ ప్రభావంతో వారసులను గెలిపించుకోవడం అనుకున్నంత తేలికైన విషయం కాదు. పైగా వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న కేడర్ ఈ వారసత్వ నిర్ణయాలను ఎంతవరకు ఆమోదిస్తారనేది ప్రశ్నార్థకమే. ఉత్తరాంధ్ర వైసీపీ సీనియర్లు బొత్స, ధర్మాన సోదరులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీ ఉనికిని చాటుకునే పోరాటం మాత్రమే కాదు. తమ రాజకీయ వారసుల భవిష్యత్తును నిర్ణయించే అగ్నిపరీక్ష . తమ బలాన్ని ఉపయోగించి వారసులను స్థానిక పీఠాలపై కూర్చోబెట్టి పొలిటికల్ రీ-లాంచ్ చేస్తారా లేక అధికార కూటమి ధాటికి డిఫెన్స్‌లో పడతారా అనేది వేచి చూడాలి.

# కమలం పార్టీకి పొలిటికల్ స్పేస్

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అంతర్గత విభేదాలు, పరిపాలనాపరమైన ఇబ్బందులతో ప్రజల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. ఇటు బిఆర్ఎస్ ప్రాభవం కోల్పోతుండటం, అటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుండటంతో.. కమలం పార్టీకి స్పష్టమైన పొలిటికల్ స్పేస్ లభించింది. కానీ, ఈ సువర్ణ అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ తీవ్రంగా తడబడుతోంది .మీరు కేసీఆర్ పదేళ్ల పాలన చూశారు, కాంగ్రెస్ మార్పు పాలననూ చూస్తున్నారు.. ఒక్కసారి కమలానికి అవకాశం ఇవ్వండి అనే బలమైన నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటినప్పటికీ, ఆ ఉత్సాహాన్ని రాష్ట్ర స్థాయి అధికారం దిశగా మళ్లించే సమిష్టి వ్యూహం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కేవలం ఢిల్లీ పెద్దల ఇమేజ్, మోదీ చరిష్మాపైనే ఆధారపడటం తప్ప.. స్థానిక నాయకత్వం ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని నింపలేకపోతోంది. కేవలం ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపడం మాత్రమే సరిపోదు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే ప్రణాళికను దాన్ని నడిపించే ఒక ఫేస్ ను చూపిస్తేనే ప్రజలు జాతీయ పార్టీలకు ప్రాంతీయ స్థాయిలో ఓటేస్తారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ బీజేపీకి ఉన్న ప్రధాన లోపం.. స్పష్టమైన సీఎం ఫేస్ లేదా తిరుగులేని ఒకరిద్దరు బలమైన నాయకులు లేకపోవడం . గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అగ్రెసివ్ హిందూత్వ, నిరసనలతో కేడర్‌లో పీక్ లెవెల్ జోష్ ఉండేది. ఆ తర్వాత జి. కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్రనేతలు ఉన్నప్పటికీ.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా గ్రూపు రాజకీయాలు సాగుతున్నాయనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల అధికార కాంగ్రెస్‌పై లేదా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఒక్కటిగా దాడి చేయలేకపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని దీదీ కోటను బద్దలు కొట్టడానికి బీజేపీ ఎలాగైతే అగ్రెసివ్ కేడర్ పాలిటిక్స్ చేసిందో, తెలంగాణలోనూ అలాంటి బెంగాల్ తరహా పోరాట వ్యూహం అవసరమనేది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. అక్కడ కమలం పార్టీ ప్రతీ పంచాయతీ, ప్రతీ వార్డు స్థాయి వరకు వెళ్లి కేడర్‌ను నిర్మించి, అధికార పార్టీ దాష్టీకాలను ధైర్యంగా ఎదుర్కొంది. కానీ తెలంగాణలో ప్రెస్ మీట్లు, కరపత్రాల పంపిణీ, ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతున్నారు తప్ప.. ప్రజల తరపున సుదీర్ఘకాలం పాటు రోడ్డెక్కి పోరాడే పాదయాత్రలు, ధర్నాలు కరువయ్యాయి. బీజేపీ పై సామాన్య ప్రజల్లో ఉన్న మరో అనుమానం.. బీఆర్ఎస్ – బీజేపీ ఒకటేనా? అనే పాత ప్రచారం. ఈ నెగెటివ్ ఇంప్రెషన్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టేలా బీజేపీ గ్రౌండ్ లెవెల్‌లో నమ్మకాన్ని కలిగించలేకపోయింది. తెలంగాణలో బీజేపీకి అధికారం దక్కాలంటే తక్షణమే కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరం. పార్టీలోని గ్రూపు తత్వాలకు స్వస్తి చెప్పి, ఒక సమర్థవంతమైన, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని ముందు పెట్టి నడిపించాలి. ప్రజల నిత్య జీవిత సమస్యలైన రుణమాఫీ, ఉపాధి, రైతు భరోసా, మౌలిక వసతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్లీ కోలుకోవడం తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చు.

## ముందుకు సాగని కొండగట్టు అభివృద్ధి పనులు

కరీంనగర్,కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నాయని, జనవరి 3న శంకుస్థాపన కూడా పూర్తయిందని పేర్కొంది. అయినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై జనసేన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. టెండర్ ప్రక్రియలో జాప్యానికి కారణం ఏంటో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై విమర్శలు గుప్పించింది. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనుల జాప్యంపై జనసేన పార్టీ ప్రశ్నలు సంధించింది. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. కొండగట్టు భక్తుల సౌకర్యాల కోసం మంజూరైన నిధులను వినియోగించి అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది. కొండగట్టు ఆలయంలో 96 గదుల సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం రూ.35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు సిద్ధంగా ఉన్నాయని జనసేన పేర్కొంది. కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులకు జనవరి 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అక్కడ పర్యటించి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసింది. అయితే శంకుస్థాపన పూర్తి అయి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు టెండర్ ప్రక్రియ ఎందుకు చేపట్టలేదో రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరింది. కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రతిపాదించిన నిర్మాణాలను ఆలస్యం చేయడం సరికాదని జనసేన పార్టీ అభిప్రాయపడింది. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ టెండర్ ప్రక్రియ ఎందుకు ముందుకు సాగడం లేదంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హిందూ భక్తుల సౌకర్యాలకు సంబంధించిన అభివృద్ధి పనులను రాజకీయ అంశంగా మార్చకుండా వెంటనే ప్రారంభించాలని జనసేన డిమాండ్ చేసింది. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరింది. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎందుకు స్పందించడం లేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. కొండగట్టు అభివృద్ధి పనులపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్, పొన్నం ప్రభాకర్ మధ్య గతంలో చోటుచేసుకున్న రాజకీయ మాటల యుద్ధం నేపథ్యంలో తాజా విమర్శలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ సభకు అనుమతి విషయంలో ఇరువురి మధ్య మాటల తూటాలు పేలాయి.

### గుడివాడలో చిట్టీల ముసుగులో టోకరాపై పోలీసుల చర్యలు

గుడివాడ,మత్స్యకార సంఘం నేత మండాది శ్రీనివాసరావు, మహాలక్ష్మి దంపతులు, కుమారుడు రేవంత్ సాయిపై వన్ టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసారు. ఇంటి సోదాల్లో కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. 32 మంది బాధితుల నుంచి రూ.51.79 లక్షల చిట్టీల మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితులు మహాలక్ష్మి, కుమారుడు రేవంత్ సాయి అరెస్ట్..14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ కు పంపారు. ప్రధాన నిందితుడు శ్రీనివాసరావు కోసం గాలింపు జరుపుతున్నారు. 32 మంది చిరు మత్స్యకార కుటుంబాల సొమ్ము దోపిడీ జరిగినట్లు సమాచారం. బయటికి రాని బాధిత కుటుంబాలు ఇంకా అనేకం. 20 ఏళ్లుగా చిట్టీల వ్యాపారం పేరుతో కోట్ల ఆస్తులు కూడపెట్టారని బాధితుల ఆరోపణ. జులై 31న ఫిర్యాదు చేసినా పోలీసులు ఆలస్యంగా స్పందించారు.

# అనిల్ లో నిర్వేదం..



నెల్లూరు, పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది. ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

# నిన్న షర్మిల.. రేపు సాయిరెడ్డి.. కొత్త శత్రువు

అమరావతి, ఏదైనా ప్రచారాన్ని సొంత వారు చెబితే ఎవరైనా నమ్ముతారు. ఎందుకంటే షర్మిల జగన్మోహన్ రెడ్డితో విభేదించి చెప్పిన తర్వాతే చాలా విషయాలపై క్లారిటీ వచ్చింది. అంతెందుకు వివేకానంద రెడ్డి హత్య అంశానికి సంబంధించి ఆయన కుమార్తె సునీత పోరాటం ప్రారంభించాక అసలు విషయం తెలిసింది. సొంత మనుషులే వివేకానంద రెడ్డి హత్య చేశారని.. దానిని రాజకీయంగా వాడుకున్నారని స్పష్టమైంది. మరోవైపు తన అన్న వ్యక్తిత్వాన్ని బయట ప్రపంచానికి తెలియజెప్పింది కూడా షర్మిల. అయితే ఇప్పుడు షర్మిల రూట్లోకి విజయసాయిరెడ్డి వచ్చారు. మొత్తం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డి గాలి తీసేశారు. మొన్నటికి మొన్న ఆయన అసమర్థ ప్రతిపక్ష నాయకుడు అన్న విమర్శ చేసిన సాయి రెడ్డి.. ఏకంగా నిన్న రెండు పేజీలతో జగన్మోహన్ రెడ్డి తో పాటు వైసిపి గుట్టు విప్పేశాడు. ముమ్ముందు మరిన్ని గుడ్లు విప్పే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు షర్మిల మాత్రమే తలనొప్పి అని భావించారు. ఇప్పుడు విజయ్ సాయి రెడ్డి రూపంలో మరో తలనొప్పి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురు కాబోతోంది.

మొన్నటి ఎన్నికల్లో షర్మిల..

మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత పెంచడంలో షర్మిల పాత్ర ఉంది. జగన్మోహన్ రెడ్డిని ఎంతగా డ్యామేజ్ చేయాలో అంతలా చేశారు. ఇంటి గుట్టును బయట పెట్టేసారు. అన్న మనస్తత్వాన్ని కూడా బయట ప్రపంచానికి తెలియజేశారు. దీంతో ఎంత నష్టం జరగాలో అంత నష్టం జరిగింది జగన్మోహన్ రెడ్డికి మొన్నటి ఎన్నికల్లో. ఇప్పుడు షర్మిల మాదిరిగానే విజయసాయిరెడ్డి సైతం మరోసారి జగన్మోహన్ రెడ్డికి భారీ డ్యామేజ్ చేసేలా కనిపిస్తున్నారు. నిన్ననే రెండు పేజీల లేఖతో విరుచుకుపడ్డారు. ముమ్ముందు తనతో చికాకు తప్పదు అంటూ సంకేతాలు పంపించారు.

ఎదురుదాడి శరణ్యం..



వచ్చే ఎన్నికల నాటికి కొత్త పార్టీతో విజయసాయిరెడ్డి ముందుంటారు. తన పార్టీ ఉనికి చాటుకునేందుకు ఆయన ఎంచుకునే ఏకైక మార్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఎదురుదాడి. తెలుగుదేశం కూటమిపై ఆయన చేసే విమర్శలు రాజకీయ కోణంలో మాత్రమే ఉంటాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై చేసే విమర్శలు మాత్రం ప్రజల్లోకి బలంగా వెళ్తాయి. చాలా ప్రభావం కూడా చూపుతాయి. కాంగ్రెస్ పార్టీ నేత రూపంలో షర్మిల ఎలాగూ చికాకు పెడతారు. విజయసాయిరెడ్డి ఆమెకు తోడు అవుతారు. రాజకీయ ప్రత్యర్థులు చేసే విమర్శలను తట్టుకోవచ్చు కానీ.. సొంత వారు చేసే విమర్శలు మాత్రం చాలా నష్టం చేస్తాయి. గత ఎన్నికల్లో షర్మిల ఎదురుదాడికి జగన్ బాధితుడు. ఇప్పుడు విజయసాయి రెడ్డి ఎదురు దాడి చేసిన ఆయనే బాధితుడు. అప్పుడు షర్మిల చేసిన పోరాటం టిడిపి కూటమికి కలిసి వచ్చింది. ఇప్పుడు విజయసాయిరెడ్డి చేసిన పోరాటం కూడా అంతిమంగా టిడిపికి లబ్ధి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మాత్రం షర్మిల తో పాటు విజయసాయిరెడ్డి అనే కొత్త శత్రువు తమకు తయారయ్యారన్న బాధ కనిపిస్తోంది.

# బీజేపీ,అకాలీదళ్ పొత్తు ...

ఛండీఘడ్,పంజాబ్ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈసారి ఎలాగైనా అక్కడ అధికారం చేజిక్కించుకోవాలని పావులు వేగంగానే కదుపుతోంది. అయితే.. బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీ.ఎల్. సంతోష్ ఓ కీలక ప్రకటన చేశారు. తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించారు. అయినా? అటు బీజేపీ, ఇటు అకాలీదళ్ పొత్తు కోసం ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. అడపా దడపా ఇరు పార్టీల మధ్య చర్చలు జరుగుతూనే వున్నాయి. కానీ.. ఓ పట్టాన తుది దశకు రావడం లేదు. ఇంత జరుగుతున్నా.. పొత్తుపై రెండు పార్టీలూ ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. అయితే.. ఇరు పార్టీల మధ్య పొత్తు వుండాలన్న తుది నిర్ణయానికి మాత్రం వచ్చేశాయి. ఈ సారి బీజేపీ అక్కడ పై చేయి సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తానే సీనియర్ భాగస్వామిగా వ్యవహరించాలని డిసైడ్ అయ్యింది. దీంతో అకాలీదళ్ అటూ ఇటూగా వున్నట్లు తెలుస్తోంది. బీజేపీ సీనియర్ భాగస్వామి అయితే మాత్రం సీట్ల విషయంలో దెబ్బే.. అన్నట్లుగా ఆలోచిస్తోంది. ఎక్కువ సీట్లు అడగడానికి అకాలీదళ్ కి ఛాన్స్ వుండకపోవచ్చు.అయితే.. పొత్తుకు అవకాశం ఉందనడానికి ఒక కీలక సూచన ఏమిటంటే, గ్రామీణ ప్రాంతాల్లోని సీట్లకు సిద్ధం కావద్దని ఎస్ఏడీ తమ నాయకులకు సూచించినట్లు సమాచారం. దీనిని బట్టి, గత పొత్తులో కంటే బీజేపీ ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంతలో, పంజాబ్‌లో బీజేపీ తన సంస్థాగత సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇటీవల ఆ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా, మొత్తం 117 అసెంబ్లీ




నియోజకవర్గాలకు సంబంధించి సన్నద్ధం కావాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అకాలీ దళ్ మరియు బీజేపీలు దీర్ఘకాల మిత్రపక్షాలుగా ఉన్నాయి, అయితే వివాదాస్పదమైన మూడు వ్యవసాయ చట్టాల విషయంలో తలెత్తిన విభేదాల కారణంగా సెప్టెంబర్ 2020లో అవి విడిపోయాయి. ఇవి కలిసి ఆరు లోక్‌సభ (1998, 1999, 2004, 2009, 2014 మరియు 2019) మరియు ఐదు పంజాబ్ అసెంబ్లీ (1997, 2002, 2007, 2012 మరియు 2017) ఎన్నికలలో పోటీ చేశాయి. విడివిడిగా పోటీ చేసిన 2022 పంజాబ్ ఎన్నికలలో, అకాలీ దళ్ కేవలం మూడు స్థానాలను మాత్రమే గెలుచుకుని దారుణంగా పడిపోయింది. బీజేపీ రెండు స్థానాలనే గెలుచుకుంది.

# వైటీపీఎస్‌లో 72 కోట్ల స్కామ్?.. కోల్,యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల టెండర్లలో మాయాజాలం



హైదరాబాద్, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లోని బొగ్గు, బూడిద ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం జెన్‌కో టెండర్లను ఆహ్వానించడంతో మూడు సంస్థలు బిడ్లు వేశాయి. వీటిలో ఎల్1గా నిలిచిన 'పవర్‌మెక్' కంపెనీకి ఈ ప్లాంట్లను అప్పగించబోతున్నారు. ఈ సంస్థతో ఇప్పటికే జెన్‌కో అధికారులు సంప్రదింపులు జరిపారు. మూడేండ్ల కాలానికి రూ.279 కోట్లతో టెండర్లు ఖరారు చేసినట్టు జెన్‌కో వర్గాలు చెప్తున్నాయి. ఇందులో రూ.72 కోట్ల స్కామ్ జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గతంలో వైటీపీఎస్ కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల ప్రైవేటీకరణకు జెన్‌కో టెండర్లను ఆహ్వానించింది. రోజువారీ వార్తాపత్రికలను సబ్‌స్క్రైబ్ చేయడంఅనంతరం వాటిని రూ.34.50 కోట్లతో 6 నెలలపాటు ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారు. ఈ లెక్కన ఇప్పుడు మూడేండ్ల కాలానికి రూ.207 కోట్లతో టెండర్లు ఖరారవుతాయని అధికారులు అంచనాలు వేశారు. కానీ, ఈ ప్రతిపాదనలు విద్యుత్తు సౌధకు చేరగానే అంచనాలను రూ.255 కోట్లకు పెంచారు. ఆ తర్వాత 'పవర్‌మెక్' కంపెనీ 10.5% అధికంగా రూ.281.77 కోట్లకు టెండర్ దాఖలు చేసింది. దీంతో అంచనాలు రూ.75 కోట్లు పెరిగి రూ.281 కోట్లకు చేరాయి. చివరికి జెన్‌కో అధికారులు సంప్రదింపులు జరుపడంతో రూ.279 కోట్లకు ఒప్పందం కుదిరినట్టు సమాచారం. ఇది ప్రాథమిక అంచనా కంటే రూ.72 కోట్లు, జెన్‌కో అధికారుల అంచనా కంటే రూ.24 కోట్లు అధికం. అంచనాలు ఇలా దశలవారీగా ఎందుకు పెరిగాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. దీని వెనుక భారీ స్కామ్ జరిగిందని విద్యుత్తుసౌధలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

అవసరానికి మించి 263 మంది

వైటీపీఎస్‌లో కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్వహణకు 1,650 మంది సిబ్బంది అవసరం. కానీ, 1,913 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కోసం టెండర్లు పిలిచారు. దీంతో అవసరానికి మించి 263 మంది సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకునేందుకు టెండర్లు పిలువడం అనుమానాలకు తావిస్తున్నది. వాస్తవానికి వైటీపీఎస్ ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఐదో యూనిట్‌లో వాణిజ్య కార్యకలాపాలు (కమర్షియల్ ఆపరేషన్ డేట్) ఇంకా ప్రారంభంకాలేదు. ఈపీసీ కాంట్రాక్టర్ అయిన బీహెచ్‌ఈఎల్ ఈ ప్లాంట్‌ను ఇంకా జెన్‌కోకు అప్పగించలేదు. అయినప్పటికీ కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు తొందరపాటుతో టెండర్లు ఖరారు చేయడం వెనుక ఏదో మంత్రాంగం జరిగే ఉంటుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఖాళీలు భర్తీ చేయకుండానే..

వైటీపీఎస్‌లో కోల్, యాష్ హ్యాండ్లింగ్‌కు అవసరమైన 1,650 మంది సిబ్బందిలో ప్రస్తుతం 1,254 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో ఇంజినీరింగ్ విభాగంలో 74, ఓఅండ్‌ఎం విభాగంలో 322 మంది సిబ్బంది కొరత ఉన్నది. ఇతర ప్లాంట్ల నుంచి ఏఈలు, ఏడీఈలను బదిలీ చేయడం, అర్హులైన ఏఈలకు ప్రమోషన్లు కల్పించడం ద్వారా ఈ లోటను భర్తీ చేయవచ్చు. మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో కోల్, యాష్ ప్లాంట్లను జెన్‌కో ఇంజినీర్లు, డిపార్ట్‌మెంటల్ వర్‌మెన్ , ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ సిబ్బంది సహకారంతో నడుపుతున్నారు. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ)లో యాష్, కోల్ ప్లాంట్లను ఇంజినీర్లే పర్యవేక్షిస్తున్నారు. కేవలం బొగ్గు, బూడిదను తరలించే పనులను మాత్రమే ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారు. కానీ, వైటీపీఎస్‌లో ఇంజినీర్ల పనులు మొదలుకొని అన్ని పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాల్సిన అవసరమేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీంతో వైటీపీఎస్‌లోని కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థకు అప్పగించే నిర్ణయంపై పునరాలోచించాలని, సిబ్బంది అవసరం,టెండర్ అంచనాల పెంపుపై ప్రభుత్వం విచారణ జరుపాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

# కాంగ్రెస్ సర్కార్‌ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ బిగ్ స్కెచ్..

హైదరాబాద్, ప్రభుత్వ వైఫల్యాలపై గులాబీ పార్టీ ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యిరోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, గ్యారెంటీలు, డిక్లరేషన్ల వైఫల్యాలపై ఎత్తిచూపేందుకు సిద్ధమవుతుంది. శాసనసభ సమావేశాలకంటే ముందే విమర్శలకు పదునుపెట్టింది. కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రధానప్రతిపక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఇప్పటికే వారం రోజుల కార్యచరణ సైతం ప్రకటించింది. అంతటి ఆగకుండా ట్రబుల్ షూటర్ హరీష్ రావు ప్రతి అంశాన్ని ఆధారాలతో సహా మీడియా ముందు చూపుతూ తప్పిదాలను ఎత్తిచూపుతున్నారు. ప్రభుత్వాన్ని ఇరుకున బెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అసెంబ్లీలోనూ 22ఏ, రాయదుర్గం భూముల స్కాం,ఆజామాబాద్ భూముల అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వంపై ఒత్తిడిపెంచేందుకు గులాబీ సిద్ధమవుతుంది. వర్షాకాల సమావేశాలు వేడిని రగుల్చేందుకు బీఆర్ఎస్ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటుంది.

సర్కార్‌పై మైండ్ గేమ్..

తెలంగాణ రాజకీయ రంగస్థలంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ దూకుడు పెంచింది. రాబోయే శాసనసభ సమావేశాలను వేదికగా చేసుకుని, అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్ని వైపులా నిలదీసేందుకు పక్కా వ్యూహాన్ని రచించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంతో పాటు భూముల వ్యవహారంలో జరుగుతున్న అక్రమాలను ప్రధాన ఆయుధాలుగా మలుచుకుంటూ సర్కార్‌పై 'మైండ్ గేమ్' షురూ చేసింది. ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్త నిరసనలకు గులాబీ అధినాయకత్వం పిలుపునిచ్చింది. సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇప్పటికే నేతలకు సైతం ఆదేశాలు ఇచ్చింది. కార్యక్రమ వివరాలను సైతం ప్రకటించింది.

రాత్రికి రాత్రే..

అయితే ఈ నెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ సమావేశాల్లో 22ఏ పై ప్రధానంగా పట్టుబట్టేందుకు సిద్ధమవుతుంది. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతభూమి ఈ 22ఏ కింద నిషేధిత జాబితాలో పండిందనే వివరాలను సేకరిస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాప్రా, బోడుప్పల్ తదితర ప్రాంతాల్లో ఉన్న పట్టా భూములు, ఇళ్ల స్థలాలను రాత్రికి రాత్రే నిషేధిత భూముల జాబితా (22ఊ) కింద చేర్చడంపై గులాబీ దళం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బాధితుల నుంచి సమాచారం సేకరించడంతో పాటు, ఏయే ప్రాంతాల్లో ఏ సర్వే నంబర్లను చేర్చారో వివరాలను భారాస ఇప్పటికే నిశితంగా సేకరించింది.

పెద్ద ఎత్తున వసూళ్లు..

22ఏ కింద బెదిరించి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిస్తుంది. ఇప్పటికే మాజీ మంత్రి హరీష్ రావు బోడుప్పల్, కాప్రా తో పాటు పటాన్ చెరువు నియోజకవర్గం, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని భూముల వివరాలను సేకరించారు. పటాన్ చెరువు నియోజకవర్గంలోనే 50వేల ఎకరాలు 22ఏ జాబితాలో నమోదైందని వెల్లడించారు. వారం రోజులు ప్రభుత్వానికి డెడ్ లైన్ పెట్టారు. 22ఏ జాబితా నుంచి తొలగించకపోతే సంగారెడ్డి కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇదే అంశంపై అసెంబ్లీలో చర్చకు




పట్టుపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో పెట్టిన అంశాలన్నంటిని ఎత్తిచూపబోతున్నారు.

ట్రబుల్ షూటర్ దూకుడు..ట్రుబల్ షూటర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇప్పటికే దూకుడు పెంచారు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97 తో పాలిటెక్నిక్ విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని ఆధారాలతో సహ వివరించారు. రాయదుర్గం భూములు, సింగరేణి స్కాం, ఇసుక స్కాం, సోలార్ పవర్ స్కాం, సివిల్ సప్లయి, ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, టిమ్స్ ఆసుపత్రి, నిరుద్యోగుల అంశం, ఇరిగేషన్ కృష్ణాజలాలు, దేవాదుల-ఎల్లంపల్లి పంపులు ఆన్ చేయకపోవడం, పంట బోనస్, పింఛన్ల పెంపుపై గళం, విద్యుత్ కోతలు.. లాగ్ బుక్స్ పరిశీలన, గురుకులాల్లో మౌలిక వసతులు, క్రైం రేటు పెంపు తదితర అంశాలన్ని ఆధారాలతో సహ వివరిస్తున్నారు.

కొరకరాని కొయ్యగా..

ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా తయారయ్యారు. ప్రభుత్వం ఏదైనా అంశంతో ముందుకు పోదామనుకున్న సమయంలోనే దాంతో జరిగే నష్టాలను ఎత్తిచూపుతున్నారు. తాజాగా అజామాబాద్ ఇండస్ట్రియల్ భూముల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. 500కోట్ల భూమిని 87కోట్లకే విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని విమర్శలను పదునుపెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ల్యాండ్ అమ్మకం చేస్తున్నారని , ఆ భూమి వివరాలను సైతం పక్కా ఆధారాలతో వెల్లడించారు. ప్రభుత్వ భూముల అమ్మకంతో జరిగేనష్టాలను సైతం ప్రజలకు వివరిస్తున్నారు.

రోడ్డుపై నిరసనలు.. సభలో గందరగోళం

కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా, సెప్టెంబర్ 2 నుంచి వీధులెక్కి నిరసనలు తెలిపేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. బయట నిరసనలతో వాతావరణాన్ని వేడెక్కించి, ఆ వెంటనే ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లోనూ అదే స్థాయిలో ప్రెజర్ పెంచాలని వ్యూహరచన చేస్తున్నారు. అంతేకాదు రైతు, ఉద్యోగ, నిరుద్యోగ, 22ఏ, భూములపై తీర్మానాలకు పట్టుబట్టాలని, ఒక్కొక్కరు ఒక్కో అంశంపై మాట్లాడాలని ఇప్పటికే పార్టీ అధిష్టానం సూచనలు చేసినట్లు సమాచారం. గతంలో మంత్రులుగా శాఖలకు పనిచేసిన అనుభవం ఉన్నవారు ఆయా శాఖలపైమాట్లాడేందుకు సన్నద్ధమవుతున్నారు.

# కాంగ్రెస్ లో అందరికీ మంత్రి పదవి కావాలి..



హైదరాబాద్,ఎన్నికలకు ముందు జూపల్లి కృష్ణారావు.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వంటి వారు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. వారికి ఆర్థిక బలం ఉంది కాబట్టి ఎన్నికల్లో గెలిచారు. అలా ఎన్నికల్లో గెలిచిన కొత్తవారు ఈసారి కాంగ్రెస్ పార్టీలో చాలామంది ఉన్నారు. కానీ వారందరినీ పక్కనపెట్టి కృష్ణారావుకు.. శ్రీనివాసరెడ్డికి మంత్రి పదవులు దక్కాయి. శ్రీనివాసరెడ్డి చేతిలో అత్యంత కీలకమైన రెవెన్యూ.. సమాచార పౌర సంబంధాల శాఖ ఉంది. కృష్ణారావు చేతిలో ఎక్సైజ్ శాఖ ఉంది. పార్టీలు మారి వచ్చిన వారికి టికెట్ ఇవ్వడమే కాకుండా.. చివరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు. ఇవి కొద్దిరోజులుగా కాంగ్రెస్ పార్టీలో కొంతమంది ఎమ్మెల్యేలు అంతర్గతంగా చేస్తున్న ఆరోపణలు. ఇందులో నిజం లేకపోలేదు. కాకపోతే పార్టీ భారాన్ని మొత్తం భుజాన వేసుకొని నడిపించడం అంత ఈజీ కాదు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లోకి వచ్చిన తర్వాతనే పార్టీ దూకుడు పెరిగింది. వేగం పెరిగింది. ఆయన పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కెసిఆర్ కొట్టిన దెబ్బలకు ఇంకొక పార్టీ అయితే లేచేది కాదు. కానీ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో జవసత్వాలు నింపి ఏకంగా పోటీలో నిలపాడు. అంతేకాదు కెసిఆర్ కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ నే అని నిరూపించాడు. బిజెపి గులాబీ పార్టీతో కలుస్తుంది అని ప్రచారం జరుగుతున్న వేళ.. ఎన్నికలను తనకు అనుకూలంగా మార్చుకొని.. విజయం సాధించేలా చేశాడు రేవంత్ రెడ్డి. అధికారంలోకి వచ్చిన తర్వాత చాలామంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరు మారింది. ముఖ్యంగా రేవంత్ రెడ్డికి దక్కుతున్న గౌరవాన్ని చూసి చాలామంది అసూయ పడుతున్నారు. ఈ క్రమంలోనే తమకు మంత్రి పదవులు కావాలని డిమాండ్ చేస్తున్నారు. సహజంగానే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత తగాదాలు ఎక్కువగా ఉంటాయి. ఆ పార్టీలో వ్యక్తిగత ప్రజాస్వామ్యం కూడా అధికంగా ఉంటుంది. అందువల్లే నిత్యం పదవుల కోసం కొట్లాటలు జరుగుతూనే ఉంటాయి. కాంగ్రెస్ పార్టీలో ఇది కొత్తది కాకపోయినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రంలో ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇది ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితికి.. భారతీయ జనతా పార్టీకి ఆయుధంగా మారింది. రేవంత్ రెడ్డి బలమైన నాయకుడు కావడంతో.. కాంగ్రెస్ పార్టీలో ఉన్న అసమ్మతిని ఎగదోసి రేవంత్ రెడ్డిని బలహీనపరిచే కుట్రలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. అనిరుద్ రెడ్డి.. అద్దంకి దయాకర్.. ఇంకా కొంతమంది నాయకులు మంత్రి పదవుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేశారు. అనేక రకాలుగా లాబీయింగ్ చేపట్టారు. చివరికి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చి సొంతంగా పార్టీ పెట్టుకున్నారు. ఇంకా చాలామంది నాయకులు.. పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలలో భాగంగా రేవంత్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ కోరుకున్నట్టుగానే రేవంత్ రెడ్డి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. అయితే ఇది ఆ నాయకులకు ఏమాత్రం లాభం చేకూర్చకపోగా.. కాంగ్రెస్ పార్టీ మరింత బలహీనం కావడానికి కారణమవుతోంది. ఒకవేళ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడున్న పరిస్థితుల్లో బలహీనమైపోతే.. ఇక జన్మలో తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కాకముందే కొంతమంది ఎమ్మెల్యేలు పక్క చూపులు చూడటం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఆ ఎమ్మెల్యేలతో రేవంత్ రెడ్డి మాట్లాడకపోవడమే ఇంతటి పరిస్థితికి కారణమైందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా మించుకుపోయింది లేదని.. ఎందుకైనా మంచిది రేవంత్ రెడ్డి వాళ్లతో మాట్లాడి.. సమస్యలు పరిష్కరిస్తేనే కాంగ్రెస్ పార్టీ ఈ ముసలం నుంచి బయటపడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140